క్లుప్తంగా


నూకాలమ్మ హుండీల ఆదాయం రూ.12.76 లక్షలు



నూకాలమ్మ ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న మహిళలు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి జాతర సందర్భంగా హుండీల ద్వారా 32 రోజులకు గాను రూ.12,76,710 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. సోమవారం దేవాదాయశాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్‌బాబు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, సభ్యులు లక్కాకుల కృష్ణ, బొజ్జా రెడ్డియ్య, బావిశెట్టి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారరామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి బారులు తీరారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి అభిషేకం, తొలి పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను, ఉప ఆలయాల్లోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయని వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.అనురాధ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా కమిటీ చైర్మన్ యండ్రు సత్తిబాబు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. పి.కాంతి దీపిక 574, కె.ఆదిలక్ష్మి 566, సత్యసాయి రాకేష్ 551, సీహెచ్ దేవి పూజిత 539, కె.ప్రసన్నకుమార్ 535, ఎం.సాయి స్వాతి 531, జి.అవినాష్ కుమార్ 529, కె.శిరీష 512 మార్కులు సాధించారని హెచ్‌ఎం వివరించారు.

తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

పెద్దాపురం: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద టీడీపీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం రైతులను ఆదుకోవాలంటూ ఆర్డీఓ జేఎస్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజా సూరిబాబు రాజు, కొత్తెం కోటి, నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వినతి

సామర్లకోట: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారికి టీడీపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు.

జ్యోత్స్నకు సత్కారం



జ్యోత్స్నను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: రమణక్కపేటకు చెందిన దడాల జ్యోత్స్న పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులతో గురుకుల పాఠశాలల్లోనే రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఆమెను సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోత్స్న రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి మండలానికి పేరు తెచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి సూర్యప్రకాష్ రెడ్డి, లోడ అప్పలరాజు ఉన్నారు.

అల నకిలీలకు చెక్

- వేటాడే మత్స్యకారులకే పథకాలు
- నిజమైన బోటు యజమానులకే సాయం
- వైఎస్సార్ మత్స్యకార భరోసాకు ఏర్పాట్లు



ఉప్పాడ తీరంలో మత్స్యకారుల నుంచి వివరాలు సేకరిస్తున్న మత్స్యశాఖాధికారులు (ఫైల్)

పిఠాపురం: మత్స్యకారులకు వేటే ఆధారం.. వారి జీవనం ప్రాణాలతో పోరాటం.. సముద్రంలో అలల కెరటాల మధ్య వేటాడి జీవనం సాగించే వారికి ప్రభుత్వం కొండంత భరోసా అందిస్తోంది. వేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసాను నిజమైన లబ్ధిదారులకే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. బోటు ఒకరి పేరున వేటాడేది మరొకరు.. ప్రభుత్వ పథకం మాత్రం వేటాడే వారికి కాకుండా బోటున్న వారికే చెందుతుండడంతో నిజంగా వేటపై జీవనం సాగించే మత్స్యకారులు నష్టపోతున్నారు. ప్రభుత్వం అందజేసే వేట నిషేధ పరిహారం, డీజిల్, బోట్ల, ఇతర వేటాడే పరికరాల రాయితీలను బోటు రిజిస్ట్రేషన్ ఆధారంగానే లబ్ధిదారులకు అందజేస్తుండగా కొందరు అనర్హులకు ఈ పథకాలు అందుతున్నట్లు అధికారులు గుర్తించారు. అర్హులెవరూ నష్ట పోకూడదన్న దృఢ సంకల్పంతో ఉన్న ప్రభుత్వం నిజమైన బోటు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించడంతో ఇటీవల మత్స్యశాఖాధికారులు జిల్లాలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. లబ్ధిదారుల ప్రాథమిక జాబితాను వైఎస్సార్ నవ వికాసం పోర్టల్‌లో నమోదు చేశారు. గ్రామ వార్డు సచివాలయాల వద్ద లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించడం ద్వారా అనర్హులు ఎవరైనా ఉంటే ప్రజలు గుర్తించడంతో పాటు అర్హులు లేకపోయినా తమ పేర్లు నమోదు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.

అర్హులు ఎంతమంది అంటే..

కొత్తపల్లి మండలంలో ఆరు మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. మొత్తం ఇక్కడ 31 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. ఇందులో 1,296 బోట్ల ద్వారా వేట సాగిస్తున్నారు. మత్స్యకార భరోసాకు 7,716 మందిని అర్హులుగా గుర్తించారు. ఇదిలా ఉంటే బోటు తయారు చేయించుకున్న కొందరు యజమానులు కొంత కాలానికి దానిని అమ్మేస్తున్నారు. దీంతో ఆ బోటు కొన్న మత్స్యకారులు ఉపయోగించుకుంటూ వేట సాగిస్తుంటారు. కానీ పాత యజమాని పేరునే ఆ బోటు రిజిస్టర్ అయ్యి ఉండడంతో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల లబ్ధి అతనికే చేరుకుంటుంది. ఇలా నిజంగా బోటుపై వేట సాగించే మత్స్యకారులకు ప్రభుత్వ లబ్ధి అందడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ నకిలీల సంఖ్య గణనీయంగా పెరగడంతో అర్హులు నష్టపోతున్న విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రెండేళ్లుగా చాలా వరకూ నకిలీలను గుర్తించి తొలగించినా ఇప్పటికీ ఇంకా పరిశీలిస్తున్నారు. గతంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రతి ల్యాండింగ్ ప్రదేశంలో ఒక్కో అధికారి 20 బోట్ల చొప్పున తనిఖీలు చేశారు. ప్రతి బోటుకు సంబంధించిన వివరాలు రెండు షీట్లపై తీసుకున్నారు. వారికి సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, యజమాని బోటు రిజిస్ట్రేషన్ నంబరు, లైసెన్స్ వివరాలు సేకరించారు. ప్రతి బోటు వద్ద యజమానిని ఉంచి బోటుతో పాటు ఫోటోలు తీసుకుని అధికారిక లెక్కల్లో ఉన్న బోటుకు సంబంధించి ఎక్కడైనా యజమాని లేకపోయినా బోటు లేకపోయినా రికార్డు చేశారు. ఇప్పటి వరకు రెండు దఫాలుగా నిర్వహించిన సర్వేలో ఎవరివైనా వివరాలు అందజేయలేకపోతే సంబంధిత యజమాని పూర్తి వివరాలతో మత్స్యశాఖాధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

> **పేరు మార్చును సద్వినియోగం చేసుకోండి**
>
> ఎవరైనా బోటు కొనుగోలు చేస్తే వెంటనే పాత యజమాని పేరున ఉన్న బోటును తమ పేరుపై మార్చుకోవాలి. అలా కాకపోతే అర్హత లేనట్టు పరిగణిస్తాం. ప్రభుత్వం నేమ్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలి. అధికారిక లెక్కల ప్రకారం రిజిష్టర్ అయ్యి ఉన్న బోటు సంబంధిత యజమాని ఆధీనంలో ఉన్నట్లు అన్ని పత్రాలు అందజేయాలి. అన్ని వివరాలు అందజేసి ప్రభుత్వానికి సహకరించి అర్హులు లబ్ధి పొందాలి.
>
> –శివరామకృష్ణ, మత్స్యశాఖాధికారి, ఉప్పాడ

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు కరణం విశ్వనాథం, రిక్షా కార్మిక సంఘం నాయకులు పెదపాటి సత్యనారాయణ, సోమరాజు, ఏడిద సత్తిబాబు, మోర్తా అప్పారావు, దూళ్లపల్లి ఏసుబాబు, ఏడిద నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ సమస్యకు పరిష్కారం

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురం నుంచి వచ్చే వర్షపు నీరు వెలమపేటలోని డ్రెయిన్ మీదుగా వెళ్లవలసి ఉంది. అయితే గత కొన్నేళ్లుగా పూడికతీత పనులు చేసేవారు లేక సదరు డ్రెయిన్ పూర్తిగా మూసుకుపోయింది. దీంతో అయోధ్యరామపురం నుంచి మఠం సెంటర్ వరకూ ఉన్న రోడ్డు కొద్దిపాటి వర్షానికే మునిగిపోతుంది. ఈ నేపథ్యంలో 25వ వార్డు కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమణలను తొలగించి పూడికతీత పనులు చేయించారు.

ఆలయ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలి

ట్రస్టు బోర్డు సమావేశంలో తీర్మానం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో నిర్వహించిన ట్రస్టు బోర్డు సమావేశం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో పని చేసే అర్చకులతో పాటు సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని ట్రస్టు బోర్డు ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం ఆలయంలో ట్రస్టుబోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లిబాబు అధ్యక్షత వహించారు. దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఆలయంలోని సిబ్బంది, అర్చకులకు యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఉత్తమ సేవలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో జరుగుతున్న అన్నదానంపై భక్తులకు ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, బొండలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబిరాణి, ఎక్స్ అఫిషియో సభ్యుడు కొంతేటి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 14 అర్జీలు

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తంగా 14 అర్జీలు వచ్చాయని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్పందనలో వచ్చిన 14 అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద మండల అధికారులు స్పందనకు అందుబాటులో ఉంటారన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల అభివృద్ధికి దోహదం



సమ్మర్ క్యాంప్ ముగింపులో విజేతలకు బహుమతులు అందజేసిన సోమన్నచౌదరి

సామర్లకోట: మాధవపట్నం శివారు జమునానగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ బాలల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల పథకాల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. జమునానగర్ బాలమందిరం, జనవిజ్ఞాన వేదిక జిల్లా వేదికలు సంయుక్తంగా 8 రోజుల పాటు జమునానగర్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారం రాత్రి ముగిసింది. కార్యక్రమంలో బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ, సంఘ అధ్యక్షుడు ఎండీ ఖాజా, పుట్టా సోమన్న చౌదరిలు బాలల త్రైమాసిక పత్రిక చిట్టి ఊహలును ఆవిష్కరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

జూడోతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం



విద్యార్థినిని సత్కరిస్తున్న మండల విద్యాశాఖాధికారి శివరామకృష్ణయ్య

సామర్లకోట: జూడో శిక్షణతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని చంద్రంపాలెంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ పాఠశాలలో సోమవారం సాయంత్రం ప్రారంభమైన సమ్మర్ జూడో శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నిత్యం ఆటలకు ఒక గంట సమయం కేటాయించాలన్నారు. పదో తరగతిలో 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన తలాటం లక్ష్మిని ఎంఈఓ సత్కరించారు.

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం



తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందిస్తున్న ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం

నాగమల్లితోట జంక్షన్: స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో రాహుల్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథి డీఎస్‌ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ ఖాన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికీ అవసరం అని చెప్పారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.

శిబిరం నిర్వాహకుడు సత్యనారాయణ మాట్లాడుతూ మే 31 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ముందు బ్యాచ్‌లో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్లు అందించారు. క్రీడాకారులను తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జునరావు అభినందించారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి



సామర్లకోట గ్రంథాలయంలో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించిన కమిషనర్

సామర్లకోట: పుస్తక పఠనంతో మేధోశక్తి పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారిణి బందిల రత్నమణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శిక్షణా శిబిరం లక్ష్యాలు, ఉపయోగాల్ని వివరిస్తూ ప్రచురించిన పోస్టర్లను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నయీం అహ్మద్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విజ్ఞానానికి సంబంధించిన అనేక పుస్తకాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారానే ఎంతోమంది దేశంలో అత్యున్నత స్థానాలకు ఎదిగారని చెప్పారు. గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా కావలసిన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే అవకాశముంటుందన్నారు.



ఉప్పాడ వేసవి విజ్ఞాన శిబిరంలో సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

కొత్తపల్లి: ఉప్పాడ, కొత్తపల్లిలలో ఉన్న గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయ అధికారులు టి.నళినీ ప్రియ, తుమ్మలపల్లి జయకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ శిబిరాలు జూన్ 11 తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. ఉప్పాడలో శిబిరాన్ని సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయన్నారు. ఈ శిబిరంలో వివిధ రకాల కళలు, చిత్రలేఖనం, స్పోకింగ్ ఇంగ్లిష్, అక్షరాలతో చిత్రాలు గీయడం, జనరల్ మ్యాథమెటిక్స్, యోగా తదితర అంశాలు నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న కమిషనర్ సురేంద్ర

తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణలు సూచించారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో వచ్చే నెల 11వ తేదీ వరకూ నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో సురేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు శిక్షణా తరగతులు ఎంతగానో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు, శ్రీదేవి, నారాయణ, కొత్త శివ, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

మునిగిన పంట పొలాల పరిశీలన



నవరలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

సామర్లకోట: మండల పరిధిలో నీట మునిగిన పంట పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సీహెచ్‌వీ నరసింహరావు, ఎ.సీతారామశర్మ, వ్యవసాయశాఖ ఏడీలు పి.స్వాతి, జీవీ పద్మశ్రీ సోమవారం సాయంత్రం పరిశీలించారు. చేను పడిపోయి నీట మునిగితే బూజు తెగుళ్ల వల్ల గింజ రంగు మారే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి ఇబ్బంది ఉన్న రైతులు వెంటనే లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్రోసికోనజిల్ లేదా ఒక మిలీగ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలన్నారు. కుప్పలు వేసే సమయంలో వర్షాలకు పనలు తడిసిపోతే ఎకరానికి 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకోవడం ద్వారా పంట నష్టాన్ని అధిగమించొచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొండెవరం గ్రామానికి చెందిన బుర్రా పోలరాజు (41) ఆదివారం తన పొలంలో గడ్డి మందు కొట్టాడు. గడ్డి మందు కలిపిన బకెట్‌లో నీటిని తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు అవగాహన

బోట్‌క్లబ్: నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఆర్ఆర్ నగర్‌లో కాలనీ వాసులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానితుల సంచారంతో పాటు ఏ విధమైన ఇబ్బందులు కలిగినా తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు శాంతియుత జీవనాన్ని గడిపేందుకు పోలీస్ శాఖ అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే, వారి గృహాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఆర్ఆర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మాండలిక వెంకటశాస్త్రి పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకొచ్చారు. అసోసియేషన్ కార్యదర్శి ఫణిప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులం నుంచే గురి పెట్టారు

ఐఐటీలో ఫ్రీ సీట్లు సాధించిన అక్కాచెల్లెళ్లు



తల్లిదండ్రులతో అక్కా చెల్లెళ్లు

పిఠాపురం: రూ.లక్షల ఫీజులు చెల్లించలేదు.. పేదరికం అడ్డు తగులుతున్నా లెక్క చేయలేదు.. బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నదే ధ్యేయంగా సాగారు.. దీనికి గురుకుల పాఠశాలను వేదికగా చేసుకున్నారు. అక్కాచెల్లెళ్లు ఒకరి తరువాత ఒకరు పదో తరగతిలో ప్రతిభ చూపి ఐఐటీ అకాడమీలో ఫ్రీ సీట్లు సాధించి ఔరా అనిపించారు. పిఠాపురం మండలం నవ ఖండ్రవాడకు చెందిన పిట్టా నానాజీ, అమూల్య దంపతుల కుమార్తెలు సురేఖ, అమృత వర్షిణి. వారిద్దరూ చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని పి.వెంకటాపురం బాలయోగి గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారు. ఇందులో పెద్దమ్మాయి సురేఖ 2019లో పదో తరగతి పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించి ఈడుపుగల్లు ఐఐటీ అకాడమీలో ఫ్రీ సీటు పొంది తద్వారా ఎంసెట్‌లో ప్రతిభ చూపి రాజమహేంద్రవరం డాక్టర్ ఎంజీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుకుంటోంది. ఆమె చెల్లి అమృత వర్షిణి అదే గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతిలో 574 మార్కులు సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన విద్యాశాఖాధికారులు ఈడుపుగల్లు ఐఐటీ అకాడమీలో ఫ్రీ సీటు కేటాయించినట్లు ఆమె తండ్రి నానాజీ తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడమే తమ ధ్యేయం అంటున్నారు. ప్రభుత్వ సహాయంతో తన ఇద్దరు కుమార్తెలు ఒక్క పైసా ఖర్చు లేకుండా వారి ప్రతిభతో ఉన్నత స్థానాలకు వెళుతుండడం చాలా ఆనందంగా ఉందని తండ్రి నానాజీ అన్నారు. పేదరికంతో తన కుమార్తెలు బతకకూడదని, ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలనే నమ్ముకున్నానని ఆయన తెలిపారు. అందరూ ప్రైవేట్ స్కూళ్లకు పంపుతుంటే.. తమ పిల్లలను పంపలేకపోతున్నానని బాధపడే వాడినని.. కానీ చదవాలనే పట్టుదల ఉండాలే తప్ప ఏ స్కూల్ అనేది ముఖ్యం కాదని తన కూతుర్లు నిరూపించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడి పిల్లలు బాగా చదువుకుంటున్నారని ఆయన తెలిపారు. ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్‌ను కావాలన్నదే తన ధ్యేయమని అమృత వర్షిణి చెప్పింది.

కొత్త దుక్కిలో కొంగ జపం



దుర్గాడలో దుక్కి దున్నుతున్న పొలంలో చేరిన కొంగలు

పిఠాపురం: రానున్న ఖరీఫ్‌లో పంటలు బాగా పండాలని.. భూమిలో క్రిమికీటకాలు పోవాలని రైతు వేసవి దుక్కు దున్నుతున్నారు. ఇందులో భాగంగా బయటపడిన కీటకాలను కొంగలు ఏరుకుంటున్న దృశ్యం గొల్లప్రోలు మండలం దుర్గాడలో కనిపించింది. ఒక రైతు తన పొలంలో వేసవి దుక్కు దున్నుతుండగా వందలాది కొంగలు పొలం నిండా వాలి నేల నుంచి బయటపడిన క్రిములను ఆహారంగా సేకరించాయి.